www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 1 జూన్ 2025 | 5 | ఏలూరు

కలెక్టరేట్‌లో నలుగురికి కరోనా

జిల్లాలో ఆరుకు చేరిన కేసుల సంఖ్య

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



జిల్లాలో శనివారం నాటికి ఆరు కరోనా కేసులు నమోదైనట్లు డిఎస్‌ఒ డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు. ఏలూరులోని కలెక్టరేట్ కార్యాలయంలో నాలుగు కేసులు నమోదయ్యాయని, ఇతర ప్రాంతాల్లో మరో రెండు కేసులు నమోదైనట్లు తెలిపారు. కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా సోకిన ఐదుగురు హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నారని, ఒకరు మాత్రం విజయవాడ మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయ స్థితి లేదన్నారు.

ఊరించి.. ఉసూరుమన్పించి..!

- అర్థాంతరంగా నిలిచిన కార్పొరేషన రుణాల ప్రక్రియ
- బిసి, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు ప్రక్రియ పూర్తి
- 25 వేల వరకూ దరఖాస్తులు..
- లబ్ధిదారుల ఎంపిక నిలిపివేత
- రెండు జిల్లాల్లో 5 వేల యూనిట్లకు బ్రేక్
- దరఖాస్తు దశలోనే ఎస్‌సి కార్పొరేషన్ రుణ ప్రక్రియ నిలిపివేత
- ఇప్పట్లో రుణాలిస్తారా.. లేదా అని జనాల్లో చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

బిసి, కాపు, ఎస్‌సి ఇతర కార్పొరేషన్ రుణాలను ప్రభుత్వం అర్థాంతరంగా నిలిపివేయడంపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించాక ఎందుకు నిలుపుదల చేసిందో ప్రభుత్వం నుంచి సరైన సమాధానం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే వైసిపి ప్రభుత్వం నిలిపివేసిన కార్పొరేషన్ రుణాలను పున:ప్రారంభించామని గొప్పలు చెప్పిన పరిస్థితి ఉంది. ఇప్పుడు వైసిపి బాటలోనే నడుస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏలూరు, పశ్చిగోదావరి జిల్లాలో బిసి కార్పొరేషన్ కింద 3,600 యూనిట్లు, కాపు కార్పొరేషన్ కింద 1,387, ఇడబ్ల్యుఎస్ కోటా కింద 215 యూనిట్లు మంజూరయ్యాయి. మార్చి పదో తేదీ నుంచి అదే నెల 22 వతేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ సైతం జరిగింది. దాదాపు 25 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు చెబుతున్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరపాల్సి ఉండగా అర్థాంతరంగా నిలిపివేశారు. ఎస్‌సి కార్పొరేషన్‌కు సంబంధించి మే పదో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దరఖాస్తుల స్వీకరణ ముమ్మరంగా జరుగుతుండగా ఆన్‌లైన్ ప్రక్రియ ఆపేశారు. అదేమని అడిగితే ప్రభుత్వ నిర్ణయమని చెప్పారు. దీంతో బిసి, కాపు, ఎస్‌సి సామాజిక తరగతులతోపాటు కార్పొరేషన్ రుణాలు పొందాల్సిన ఇతర సామాజిక తరగతుల ప్రజానీకంలోనూ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కార్పొరేషన్ రుణాల ప్రక్రియ ఎందుకు ఆపేశారో అధికారులుగాని, ప్రభుత్వంగాని సరైన సమాధానం ఇవ్వని పరిస్థితి ఉంది.

రుణాల కోసం ఎదురుచూపులు

కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు సైతం విడుదల చేసింది. రూ.లక్ష నుంచి రూ.పది లక్షల వరకూ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి రుణాల మంజూరు ప్రక్రియ ఉంది. జనరిక్ మెడికల్ స్టోర్లు సైతం ఈసారి కార్పొరేషన్ రుణాల్లో పెట్టారు. కార్పొరేషన్ రుణం వస్తే 50 శాతం సబ్సిడీ వర్తిస్తోంది. రూ.ఐదు లక్షల రుణం తీసుకుంటే రూ.రెండున్నర లక్షలు సబ్సిడీ రానుంది. లబ్ధిదారులు బ్యాంకులకు రూ.రెండున్నర లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. 2014-19 మధ్య ఎస్‌సి కార్పొరేషన్ రుణాల్లో భాగంగా టిడిపి ప్రభుత్వం ఇన్నోవా వంటి కారులు సైతం ఇచ్చింది. కారులు పొందిన లబ్ధిదారులకు ఉపాధి దొరకడంతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకున్న పరిస్థితి ఉంది. పాడి పశువులను సైతం కొనుగోలు చేసుకుని జీవనం పొందారు. కొంతమంది కిరాణా దుకాణాలు వంటివి ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందారు. 2019లో అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను నిలిపివేయడంతో జనాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ ప్రభావం 2024లో ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరిస్తామని కూటమి నాయకులు చెప్పారు. హామీ ఇచ్చినట్లుగా కార్పొరేషన్ రుణాలను ప్రారంభించిన ప్రభుత్వం కారణం చెప్పకుండా ఆపేసింది. కార్పొరేషన్ రుణం వస్తే ఉపాధి మార్గం దొరుకుతుందని లబ్ధిదారులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకుండాపోయింది. ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ రుణాల ప్రక్రియను ప్రారంభించి లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం ఆగిరిపల్లిలో పర్యటించిన మంత్రి కొలుసు పార్థసారధి గ్రామంలో పలు కుటుంబాలను స్వయంగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు అమలు కానున్నాయన్నారు. ఆర్థికంగా ఎంత భారమైనా ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాల్జేసిందన్నారు. రానున్న ఐదేళ్లలో చింతలపూడి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగునీటి సమస్యను తీరుస్తామని, ఇల్లు లేని ప్రతి నిరుపేదకూ రానున్న ఐదేళ్లలో పక్కా ఇల్లు కట్టించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు తమకు గతంలో టిడిపి ప్రభుత్వ సమయంలో పేదలకు స్థలాలు మంజూరు చేశారని, వాటిల్లో కొంతమంది ఇళ్లు నిర్మించుకున్నారని, ఇల్లు ప్రారంభ దశలో ఉండగా, తదనంతరం వచ్చిన వైసిపి నాయకులు సదరు ఇళ్లకు బిల్లులు చెల్లించలేదని, ప్రారంభ దశలో ఇళ్లు ఉన్నవాటి నిర్మాణ పనులు పూర్తి చేయనీయలేదన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. సదరు బిల్లుల చెల్లింపులకు, ప్రారంభ దశలో ఉన్న ఇళ్లకు కొత్త ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కొంతమంది ఇంటి పట్టాల సమస్య గురించి తెలియజేయగా త్వరలో మీ సమస్య తీరుస్తానని మాటిచ్చిన మంత్రి, కొంతమంది విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చాయని మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్‌తో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి, కొంతమంది వృద్ధాప్య పింఛన్లు ఇప్పించాలని కోరగా, అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని ఆదేశించారు. మండలంలో భూసమస్యల పరిష్కారానికి సబ్‌కలెక్టర్‌తో కలిసి ప్రత్యేక సమీక్ష ఏర్పాటు చేస్తానన్నారు. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆగిరపల్లి మండలంలో డ్రెయినేజీ, రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని మంత్రి చెప్పారు. మంత్రి వెంట పలువురు అధికారులు, కూటమి నాయకులు ఉన్నారు.



బంగారు కుటుంబాలతో మాట్లాడుతున్న మంత్రి

2న చింతలపూడిలో పిజిఆర్ఎస్

పాల్గొనున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) నిర్వహణలో భాగంగా జూన్ 2వ తేదీ సోమవారం చింతలపూడిలో జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొవాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి మినహాయింపు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే జిల్లా కలెక్టరేట్‌లోనూ, అన్ని మండలాలు, పట్టణ కేంద్రాల్లో పిజిఆర్ఎస్ కార్యక్రమం యథాతథంగా జరుగుతుందని చెప్పారు.

స్పెషల్ కేటగిరి సర్టిఫికెట్ల ధ్రువీకరణ విజయవంతం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటిలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం ఎన్‌సిసి, సిఎపి, బిఎస్‌జి, క్రీడలు కోటాలకు సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ ధ్రువీకరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం 2025 మే 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో నిర్వహించారు. మొత్తం నాలుగు రోజుల పాటు జరిగిన సర్టిఫికెట్ల ధ్రువీకరణ ప్రక్రియను అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు విశేషంగా ప్రశంసించారు. సంస్థ చేసిన పరిశీలన ఏర్పాట్లు, పారదర్శకత, పారిశుధ్య ఏర్పాట్లు, సిబ్బంది సహకారం అభినందనీయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, అడ్మిషన్ కన్వీనర్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ నిర్వహించారు. ప్రొఫెసర్ గోపాలరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అర్జునరావు, ఇతర అధ్యాపక బృంద సభ్యులు పర్యవేక్షించారు. సర్టిఫికెట్ పరిశీలన కార్యక్రమాన్ని నాలుగు రోజులపాటు సమర్థవంతంగా నిర్వహించిన ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ సిబ్బందికి ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సర్టిఫికెట్ల ధ్రువీకరణలో విద్యార్థులు

దుకాణాల ద్వారా రేషన్ పంపిణీకి సర్వం సిద్ధం

1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 1123 రేషన్ దుకాణాల్లో జూన్ ఒకటో తేదీ నుంచి నిత్యావసర వస్తువులు అందించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 1123 రేషన్‌దుకాణాల్లో 6,20,146 మంది కార్డుదారులకు రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఆయా ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధుల ద్వారా సదరు రేషన్ పంపిణీ పండగ వాతావరణంలో అధికారికంగా ప్రారంభిస్తారన్నారు. కార్డుదారులకు ప్రతినెలా ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకూ బియ్యం, పంచదార పంపిణీ చేస్తారన్నారు. 65 సంవత్సరాలు పైబడిన కార్డుదారులకు, వికలాంగులకు ప్రతినెలా ఒకటో తేదీ నుండి ఐదో తేదీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోపు సంబంధిత రేషన్ డీలర్లు ద్వారా కార్డుదారుల ఇంటివద్దకే నిత్యావసర సరుకులు అందజేస్తారన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ రైస్‌కార్డుల జారీకి 4న ప్రత్యేక కేంద్రం

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ట్రాన్స్‌జెండర్స్ రైస్‌కార్డుల జారీకి జూన్ 4న జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. ఈ కేంద్రంలో ట్రాన్స్‌జెండర్స్‌కు రైస్, ఆధార్ కార్డుల జారీ, ఆధార్ కార్డులో మార్పులు, రైస్ కార్డులో కుటుంబ సభ్యుల మార్పులు, చేర్పులు, ఆధార్ కార్డులో చిరునామా తదితర మార్పులు చేస్తారని తెలిపారు. ట్రాన్స్‌జెండర్స్ ఈ కేంద్రం ద్వారా అందించే సేవలు వినియోగించుకోవాలని జెసి కోరారు.

నేడు 5కె వాక్ థాన్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నాషా ముక్త్ భారత్ అభియాన్ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అవగాహనా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి జూన్ ఒకటో తేదీ ఆదివారం ఉదయం 6.30 గంటలకు 5కె వాక్ థాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్‌కుమార్ తెలిపారు. వట్లూరులోని సిఆర్.రెడ్డి మహిళా కళాశాల నుంచి ఇండోర్ స్టేడియం వరకు 5కె వాక్ థాన్ కార్యక్రమం సాగుతుందన్నారు.

పోలీస్‌స్టేషన్ కోసం ఇరిగేషన్ స్థలం పూడ్చేశారు..!

- పాఠశాల ప్రహరీ ధ్వంసం
- ఏళ్ల నాటి వృక్షాలు కొట్టివేత
- అధికారుల తీరుపై ప్రజల విమర్శలు
- ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజల కోసమే వ్యవస్థలు. వ్యవస్థల ద్వారా ప్రజలకు సేవలందిస్తూ సంబంధిత శాఖల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు పాఠశాల ప్రహరీ గోడను ధ్వంసం చేయడంతో పాటు ఏళ్ల నాటి వృక్షాలను నరికి వేసినా, ఇరిగేషన్ స్థలాన్ని పూడ్చివేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఆక్రమణలు తొలగించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై కంచె చేను మేసిన చందంగా ఉందని బహిరంగ విమర్శలు ఉన్నాయి. దీంతో పాఠశాలలోని విద్యార్థులకు రక్షణ కరువైందని, మండలాభివృద్ధికి కొందరు అధికారులే ఆటంకంగా మారారని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటనతో అధికారుల విధులు ప్రభుత్వ ఆదేశాలపై ఉన్న గౌరవాన్ని తేటతెల్లం చేస్తున్నాయని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

జాతీయ రహదారి పామర్రు దిగమర్రు 165 అభివృద్ధిలో భాగంగా మండవల్లి పోలీస్ స్టేషన్ తొలగించారు. మండల ప్రాథమిక పాఠశాల-1 వెనుక ఉన్న ఇరిగేషన్ స్థలంలో పోలీస్‌స్టేషన్‌తో పాటు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం కూడా ఏర్పాటు చేసేందుకు అధికారులు, రాజకీయ నాయకులు నిర్ణయించినట్లు సమాచారం. ఆక్రమణ తొలగించాలని జిఒ 188 ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. పోలీస్ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు స్థలాన్ని పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో గుట్టుచప్పుడు కాకుండా పాఠశాల ప్రహరీ గోడను రెండువైపులా ధ్వంసం చేసి ప్రజల కళ్లు కప్పి కేవలం రాత్రి వేళల్లోనే స్థలాన్ని మెరక చేసేశారు. అంతటితో ఆగకుండా పాఠశాలలో కాలువ గట్టుపై ఉన్న భారీ వృక్షాలను సైతం విచక్షణారహితంగా నరికి అమ్మేసి వచ్చిన సొమ్మును కూడా స్వాహా చేసేశారు. అనంతరం జిఒ 188 అడ్డు రావడంతో ఆ స్థలంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటును నిలుపుదల చేసి వదిలేశారు. దీంతో పాఠశాలలో పచ్చదనం కనుమరుగవడంతో పాటు పాఠశాల అంగన్వాడీలోని చిన్నారులకు రక్షణ కరువైపోయింది. పోలీస్ స్టేషన్ నిర్మించలేనప్పుడు పాఠశాల ప్రహరీ గోడను ధ్వంసం చేసి, చెట్లను నరికి, ఇరిగేషన్ స్థలాన్ని ఎందుకు పూడ్చారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలోకి ఆవులు, కుక్కలు, పందులతో పాటు విష పూరితమైన కీటకాలు స్వైరవిహారం చేస్తున్నాయని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరిది బాధ్యత అని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కొందరు అధికారులు అనాలోచిత నిర్ణయాలు గ్రామస్తులు, విద్యార్థుల పాలిట శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కూడా అదేవిధంగా పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను పోలీస్‌స్టేషన్‌కు కేటాయిస్తూ అధికారులు నిర్ణయం చేసి లబ్ధిదారులకు అన్యాయం చేయవద్దని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చెట్లు నరికి, గోడలను ధ్వంసం చేసినా పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకుని ప్రహరీ గోడను పున:నిర్మించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని, పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటును నిలుపుదల చేయాలని లబ్ధిదారులు, ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలో ప్రహరీ గోడ ధ్వంసం చేసిన ప్రాంతం

దీనిపై ఎంఇఒ డి.రామారావును వివరణ కోరగా తాను ఎంఇఒగా బాధ్యతలు చేపట్టే సమయానికే ప్రహరీ గోడ ధ్వంసం చేసి ఉందని, చెట్లు కూడా నరికివేసినట్లు గమనించానని చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలు మండల విద్యా శాఖలో లేవని తెలిపారు.

ఎంపిడిఒ రామలింగేశ్వరరావును వివరణ కోరగా చెట్లు నరకాలంటే తప్పనిసరిగా అనుమతులు ఉండాలన్నారు. అధికారులు ఆక్షన్ నిర్వహించిన తర్వాతే చెట్లను నరకాలన్నారు. వాటి ద్వారా వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. పాఠశాలలో నరికిన చెట్లు, ప్రహరీ గోడ ధ్వంసంపై వివరాలు తెలియవని, తనకన్నా ముందు ఉన్న ఎంపిడిఒను వివరాలు అడిగి తెలుసుకుంటానని తెలిపారు.

ట్రాక్టర్‌పై తరలిస్తున్న పాఠశాలలో నరికిన చెట్లు

దళితుల భూములు వారికే అప్పగించాలి

వ్యకాస, భూ పోరాట సంఘం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని చిన్నాగిరిపల్లి గ్రామంలో అన్యాక్రాంతానికి గురైన దళితుల భూముల్లో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం, భూపోరాట సంఘం ఆధ్వర్యంలో ముళ్ల పొదలను తొలగించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్తు కోటేశ్వరరావు మాట్లాడుతూ అన్యాక్రాంతానికి గురైన దళితుల భూములను పరిరక్షించి, వారి భూములను వారికే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూపోరాట సంఘం నాయకులు అర్జునరావు, రంగారావు, మరియమ్మ పాల్గొన్నారు.

ముళ్ల పొదలను తొలగిస్తున్న నేతలు

కలకలం.. కలవరం..!

ఉమ్మడి జిల్లాలో వరుస పరిణామాలు రెండు జిల్లావాసులను కలవర పరుస్తున్నాయి. థియేటర్లలో అధికారుల తనిఖీలు కలకలం సృష్టించగా, ఏజెన్సీలో మరోసారి పోలవరం నిర్వాసితుల కోసం భూసేకరణ చేపట్టడం సాగులో ఉన్న గిరిజనుల్లోనూ, కరోనా కేసులు పెరుగుతుండటం జిల్లావాసుల్లో కలవరం సృష్టిస్తున్నాయి.

పవన్ కల్యాణ్ సినిమా విడుదల నేపథ్యంలో థియేటర్ల బంద్ వ్యవహారం చిలికిచిలికి గాలివానలా మారి థియేటర్లలో తనిఖీలకు దారితీసింది. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో అన్ని థియేటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. జనం చాలాకాలంగా ఇబ్బంది పడుతున్నట్లుగానే తినుబండారాల ధరలు అధికంగా ఉండటం, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు సక్రమంగా లేకపోవడం వంటి విషయాలను అధికారులు గుర్తించారు. ఉన్నతాధికారులకు నివేదించారు. ఆయా థియేటర్ల యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేశారు. అయితే థియేటర్ల నిర్వహణలో ఈ దాడులు ఎంతవరకూ మార్పు తీసుకొస్తాయనేది సందేహాస్పదమే. ఎందుకంటే దాడులు జరిగాక కూడా అత్యధిక థియేటర్లలో తినుబండారాల ధరల్లో ఏమాత్రం మార్పు కానరాని పరిస్థితి ఉంది. ఇక మరుగుదొడ్లు మాత్రం కొంత మెరుగుపడ్డాయని చెప్పొచ్చు. అయితే ఈ పరిస్థితి ఎన్ని రోజులు కొనసాగుతుందనేది అనుమానమే. కారణం ఏదైనా థియేటర్లలో పరిస్థితులు మెరుగుపడి ప్రజలకు నిజంగానే వినోదం లభించే పరిస్థితి ఉంటే కచ్చితంగా పాలకులను ప్రశంసించాల్సిందే. లేనిపక్షంలో జనం మరోసారి పాలకుల ఆటలో మోసపోయారని చెప్పక తప్పదు.

ఇక ఏజెన్సీలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో అల్లూరి జిల్లాలోని పోలవరం నిర్వాసితుల కోసం సుమారు 500 ఎకరాలు సేకరించనున్నట్లు అధికారులు ప్రకటించి, పరిశీలన ప్రారంభించారు. దీనిపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ వివాదాల్లో లేని భూములనే సేకరిస్తామని చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం చాలా గ్రామాల్లో ఇప్పటికే గిరిజనుల సాగులో ఉన్న భూములను సేకరించడానికి అధికారులు కసరత్తు చేస్తుండటం సర్వత్రా ఆందోళన నెలకొంది. దీనివల్ల సాగులో ఉన్న గిరిజనులకు, ఆర్‌అండ్‌ఆర్ కింద పట్టాలిచ్చిన గిరిజనులకు మధ్య ఘర్షణలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో స్పష్టంగా పరిశీలించడంతోపాటు మండల, గ్రామస్థాయిలో అభ్యంతరాలను స్వీకరించి గిరిజనుల సాగులో లేని, వివాదాలు లేని భూములను సేకరించడం అత్యంత ఉత్తమం. తద్వారా అటు నిర్వాసితులకు, ఇటు సాగులో ఉన్న గిరిజనులకు న్యాయం జరుగుతుంది. లేనిపక్షంలో ప్రభుత్వమే గిరిజనుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నంగా అంతా పరిగణిస్తారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఇక కరోనా కేసులు అందరినీ కలవర పరుస్తున్నాయి. ఇప్పటికే పది వరకూ కేసులు నమోదైనట్లు వార్తలు వచ్చినా అధికారికంగా ఆరు కేసులను మాత్రమే గుర్తించినట్లు వైద్యఆరోగ్య శాఖాధికారులు ప్రకటించారు. జిల్లా కలెక్టరేట్‌లోని నలుగురు ఉద్యోగులకు ఒకేసారి కరోనా రావడం అందరినీ కలవరపరుస్తోంది. అయితే ఆస్పత్రుల్లో కరోనా వార్డులు సిద్ధం చేసిన ప్రభుత్వం ప్రజలను చైతన్యపర్చడంలో మాత్రం వెనుకబడిందనే చెప్పొచ్చు. ఇప్పటికీ కరోనా లక్షణాలు కన్పిస్తే నిర్ధారణా పరీక్షల కోసం జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులను లేదా ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. తక్షణం జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల్లో కరోనా నిర్ధారణా పరీక్షలు చేపట్టడంతోపాటు మందులు అందుబాటులో ఉంచడం, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేయడం వంటి చర్యలు చేపట్టాలి. తద్వారా ప్రజల్లో నెలకొన్న ఆందోళనను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలి.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఘనంగా వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు 28వ రోజు శనివారం విజ్ఞానదాయకంగా జరిగాయి. గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు పుస్తక పఠనంలో పెద్దబాలశిక్ష, చమత్కార కథలు, ఆంగ్ల కథలు, నీతి కథలను చదివించి వాటిల్లో నీతిని చిన్నారులో వివరించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ పి.శంకర్ డ్రాయింగ్ టీచర్ విద్యార్థులకు స్వర్ణాంధ్ర-2047అనే అంశంపై మన ఆంధ్రప్రదేశ్ 2047నాటికి స్వర్ణాంధ్రాప్రదేశ్‌గా ఎలా అభివృద్ధి చెందుతుందో ఏవిధంగా రూపు దిద్దుకుంటుందో ఉదాహరణగా చిత్రలేఖనం బొమ్మలు గీసే శిక్షణ అందించారు. రిసోర్స్ పర్సన్ ఐ.శ్రీనివాస్ విద్యార్థులకు మేధాశక్తి పెరగడానికి విజ్ఞానంతో కూడిన జనరల్ నాలెడ్జ్‌పై పోటీలు నిర్వహించారు. తొలుత విరామంలో చిన్నారులకు స్నాక్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్‌కుమార్, ఎండి.అస్లాంపాషా, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఏలూరులో...

దెందులూరు : పెదపాడు శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు అభయారణ్యం, అడవుల ఉపయోగాల గురించి రిసోర్స్‌పర్సన్ వేమిరెడ్డి నాగేంద్ర వివరించారు. దేశంలో 14 శాతం భూభాగంలో మాత్రమే అడవులు ఉన్నాయని, వీటిలో ప్రత్యేకంగా ఏర్పరిచిన అభయారణ్యంలో, నేషనల్ పార్కులతో వన్యమృగాలను పరిరక్షిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా దేశపు పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఎడారుల్లో ఈశాన్య భారతదేశపు కొండ ప్రాంతాల్లో, కోస్తా ప్రాంతాల్లో ఎన్నో రకాల వన్య మృగాలు కనిపిస్తాయని తెలిపారు. అండమాన్ నికోబార్, లక్షద్వీపాల్లో కూడా సాగర జంతువుల పరిరక్షణ కేంద్రాన్ని, జలాశయాలను ఏర్పరిచారని చెప్పారు. అనంతరం పంతులు జోగారావు రచించిన చిట్టి బాబు చిట్టి కథలు పుస్తకం నుంచి చిన్నారి చిట్టి ఎలుక సాహసాలు అనే కథను విద్యార్థులచే చదివించడం, కథలు చెప్పించడం, పుస్తక సమీక్ష చేయించడం వంటివి చేశారు. విద్యార్థులకు కంప్యూటర్ నాలెడ్జ్‌లో భాగంగా కంప్యూటర్‌లో బొమ్మలు వేయడం నేర్పించి, వారితో వేయించారు. గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్‌బాబు ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. విద్యార్థులకు స్నాక్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన ప్రధానోపాధ్యాయులు

జెడ్‌పిహెచ్ పాఠశాలల హెచ్‌ఎంలుగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. చనుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎం.రవీంద్రనాథ్, పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్.శ్రీనివాసరావు, మర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అప్పారావులు బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగోన్నతిపై శనివారం సాయంత్రం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాధ్యతలను స్వీకరించారని మండల విద్యాశాఖాధికారి వివిఎస్‌వి.బ్రహ్మాచారి తెలిపారు.

గుడిపాడు జెడ్‌పిహెచ్ స్కూల్ హెచ్‌ఎంగా నాగబాబు

నాగబాబు

ముసునూరు : మండల పరిధిలోని గుడిపాడు గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు నూతన ప్రధానోపాధ్యాయులుగా నాగబాబు శనివారం ఉద్యోగ భాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో స్కూల్ అసిస్టెంట్‌గా మండలంలోని బలివే, రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేశారు. బదిలీలో భాగంగా నూజివీడు టౌన్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా, స్టాఫ్ సెక్రటరీగా, నూజివీడు బాలికల పాఠశాలలో ఫస్ట్ అసిస్టెంట్‌గా భాధ్యతలు నిర్వర్తించారు.

రూ.25 లక్షలతో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు

చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

రూ.25 లక్షలతో ప్రజారోగ్య సంక్షేమ నిమిత్తం వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నామని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడిలో ఉన్న మొహిద్దిన్ కుంట (చిన్న చెరువు) ఆధునికీకరణకు చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ పాత బస్టాండ్‌లో ఉన్న మంగ బావి వద్ద అమృత్ 2.0 పథకంలో భాగంగా ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికీ డ్రింకింగ్ ప్యూరిఫైర్ వాటర్ అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అదేవిధంగా నాణ్యమైన కేబుల్ వైర్లతో, నూతన పోల్స్‌తో సెంట్రల్ లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ఎన్‌సిసి క్యాంపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నాలుగో ఆంధ్ర బాలికల బెటాలియన్ క్యాంపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ఎన్‌సిసి క్యాంపు ఎసిడెంట్ కెప్టెన్ సిహెచ్.సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఆరు కళాశాలలు, 14 పాఠశాలల నుండి మొత్తం 652 మంది బాలికలు క్యాంపునకు హాజరైనట్లు తెలిపారు. ఈ క్యాంపులో డ్రిల్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బాటిల్ క్రాఫ్ట్ గేమ్స్, యోగా, వివిధ సాంస్కృతిక పోటీలు, గేమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో పాల్గొనడం వల్ల బాలికలు ఎన్‌సిసిలో ఎ, బి, సి సర్టిఫికెట్ ఎగ్జామ్‌కు అర్హత సాధిస్తారని తెలిపారు. కమాండింగ్ ఆఫీసర్ బల్వేందర్ సింగ్ ఆధ్వర్యంలో క్యాంపు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

ఉపాధికి ఉపయోగపడేలా కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉపాధికి ఉపయోగపడే విధంగా కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు బిఎస్ఆర్ కంప్యూటర్స్ అధినేత పూర్ణచంద్రరావు తెలిపారు. ఏలూరులోని బిఎస్ఆర్ కంప్యూటర్స్ శాంతినగర్ బ్రాంచ్‌లో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం శ్రీ భారతి విద్యాసంస్థల ఎమ్‌డి భారతి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ బిఎస్ఆర్ కంప్యూటర్స్ వారు ఎంతో నైపుణ్యాలతో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. ఎంతోమంది విద్యార్థులు వీరి దగ్గర కంప్యూటర్ శిక్షణ తీసుకుని ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారికి ఉపాధి కూడా వీరే కల్పిస్తున్నారన్నారు. ఏలూరు నగర ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో దీప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

పొగాకు ఆధారిత ధూమపానంతో అనేక దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని, వాటికి దూరంగా ఉండాలని కాగుపాడు పిహెచ్‌సి వైద్యురాలు పి.మానస అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ ప్రభుత్వ, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు నమలడం, తాగడం మంచిది కాదన్నారు. పొగాకు తాగేవారికన్నా దాని పొగ పీల్చేవారికే అధిక ముప్పు ఉంటుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పొట్ల ఏడుకొండలు, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ సత్యనారాయణ, స్టాఫ్ నర్స్, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పొగాకు వినియోగంతో ఏర్పడే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ మాట్లాడుతూ పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగంతో నోటి కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, చర్మ కేన్సర్, గర్భస్థ కేన్సర్ వంటి అనేక ప్రమాదకరమైన కేన్సర్లు ఏర్పడతాయన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని పూర్తిగా అరికట్టి, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకుని, క్రమశిక్షణతో జీవిస్తే ఆరోగ్యం దినదినాభివృద్ధి సాధిస్తుందని సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యాన్ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రాజుపోతేపల్లి అడ్డరోడ్డు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి మండలం బట్టువారిగూడెం గ్రామానికి చెందిన జక్కుల నరసింహారావు కుమారుడు ప్రకాష్‌బాబు (21) మండలంలోని కె.జగ్గవరంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు శనివారం బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో రాజుపోతేపల్లి అడ్డరోడ్డు సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వచ్చిన వ్యాన్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ప్రకాష్ బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలీని వాహనం ఢీకొని..

ముదినేపల్లి : గుర్తు తెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెనుమల్లి పంచాయతీ శివారు సింగారం గ్రామానికి చెందిన చిన్నం పెద్ద రాజులు(30) గుడివాడలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో గుడివాడలోని ముబారక్ సెంటర్ వద్దకు వచ్చేసరికి గుర్తు తెలీని వాహనం బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పెద్దిరాజులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. పెద్దిరాజులు మృతితో సింగారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు శనివారం సాయంత్రం బంధువులకు అప్పగించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య

వంద శాతం ఉత్తీర్ణత అయిన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సొంతం

కరస్పాండెంట్ ఐనల్వర్ సదాఫ్‌ఖాద్రి, ప్రిన్సిపల్ ఇమ్మానియేల్

అయిన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్

ఐనల్వర్ సదాఫ్‌ఖాద్రి


ఇమ్మానియేల్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అయిన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనపరుస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఐనల్వర్ సదాఫ్ ఖాద్రి, ప్రిన్సిపల్ ఎల్. ఇమ్మానియేల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. మండల పరిధిలోని బోర్వంచ గ్రామంలో 2018లో సువిశాలమైన మూడు ఎకరాల సొంత ప్రాంగణంలో రకరకాలైన ఔషధ మొక్కల మధ్య భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు చిరునామాగా పాఠశాల కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 2018లో ఏడో తరగతి వరకు 150 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులతో పాఠశాల నిర్వహణ ప్రారంభించినట్లు తెలిపారు. పదో తరగతి 2021 నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. ఆనాటి నుంచి గడచిన ఐదేళ్లుగా పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యాసంస్థగా మంచి గుర్తింపు లభించినట్లు వివరించారు. పాఠశాలకు బస్సు సౌకర్యం ఉందని చెప్పారు. పాఠశాలలో విద్యార్థుల అభిరుచి మేరకు బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల ప్రాంగణంలో వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, క్రికెట్, కోకో, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడాంశాల్లో ప్రత్యేకమైన శిక్షణ అందించి నిష్ణాతులుగా తీర్చి దిద్దుతున్నట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో అధిక శాతం ప్రతిభ కనపరుస్తున్నట్లు చెప్పారు. రోబోటిక్ సబ్జెక్ట్, అబకాస్, వేదిక్ మ్యాథ్స్, ఐదో తరగతి వరకు డిజిటల్ తరగతి గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి ఫీజుల భారంతో చదివించలేని తల్లిదండ్రులకు ఒక తీపి కబురుగా అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను ఎనిమిదేళ్ల నుంచి అందిస్తున్నామని వివరించారు.

ఉదయం నుంచి రాత్రి వరకు చదువు పేరుతో బాల్యాన్ని హరించటం ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పాఠశాల కొనసాగుతుందన్నారు. మధ్యలో భోజన విరామం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఎంతో నమ్మకంగా తమ పాఠశాలకు పంపుతున్నారని, వారందరి నమ్మకానికి వన్నె తెచ్చే రీతిలో చిన్నారుల బాల్యం ఇక్కడ పదిలంగా ఉంటుందన్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన పీడీలు చిన్నారులతో ఆటలు ఆడించడం, సాంస్కృతిక విభాగానికి చెందినవారు పాటలు పాడిస్తూ నృత్యాలు చేయించడం ద్వారా విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాఠశాలకు వస్తున్నట్లు వివరించారు. కుల, మత, వర్గ విబేధాలకు తావు లేదనే అంశాన్ని స్పష్టంగా చిన్నారులకు సోదాహరణంగా వివరిస్తున్నట్లు చెప్పారు. ఉదయం పూట నిర్వహించే అసెంబ్లీలో చెప్పిన విధంగా మనమంతా భారతీయులమనే భావన ప్రతిఒక్కరిలో వచ్చేలా ప్రణాళికాబద్ధంగా ముందడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఏ ఒక్కరూ కులమతాలకు పరిమితం కారాదని, తోటి వారి అభిప్రాయాలను గౌరవిస్తూ, సాంప్రదాయాలు పరిరక్షించుకునే దిశగా అడుగులు వేయాలని సూచిస్తున్నామని తెలిపారు. అయిన్ రియల్ ఇండియన్‌గా గొప్ప బ్రాండ్ క్రియేట్ అయిందన్నారు. ఇది ఎంతో సంతోషించదగిన పరిణామంగా గుర్తించినట్లు తెలిపారు.

దాతల సాయం అందరికి స్ఫూర్తిదాయకం

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

మందులు అందిస్తున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సామాజిక స్ఫూర్తితో అవసరార్థులకు సహాయం అందించే విషయంలో వివిధ రంగాల ప్రముఖులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి చెప్పారు. దాతలు, ప్రముఖుల సేవా కార్యక్రమాలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని, దీంతో మరింతమంది తమ దాతృత్వాన్ని, సేవాగుణాన్ని చూపించుకునేందుకు ముందుకు వస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. ఏలూరు రామచంద్రరావుపేటలోని విజయ చర్మవ్యాధుల ఆసుపత్రి అధినేత డాక్టర్ దశిక సుబ్బారావు ఆధ్వర్యంలో ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన 750వ ఉచిత చర్మవ్యాధుల శిబిరాన్ని ఎంఎల్‌ఎ బడేటి చంటి ప్రారంభించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా డాక్టర్ సుబ్బారావు ప్రతిఏటా క్రమం తప్పకుండా ఉచిత చర్మవ్యాధుల శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ వల్ల ఎంతోమంది రోగులకు ప్రయోజనం కలుగుతుందని, అంతేకాకుండా ఇటువంటి శిబిరాలు నిర్వహించాలన్న స్ఫూర్తి ఇతరుల్లో కూడా పెంపొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దాతలు, ప్రముఖులు నిర్వహించే సేవా కార్యక్రమాలు సమాజంలోని ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. డాక్టర్ దశిక సుబ్బారావు మాట్లాడుతూ 36 ఏళ్ల నుంచి తాను వైద్యునిగా సేవలందిస్తున్నానని, ఇప్పటివరకు 750 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, 63 వేల మందికి వైద్యసేవలందించడంతో పాటు మందులు కూడా ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, పలువురు ప్రముఖులు, వైద్యులు జీవనలత, ప్రత్యూష, సుబ్బారావు సతీమణి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ

అన్ని ఏర్పాట్లు పూర్తి

పలు మండలాల తహశీల్దార్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు

జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉంగుటూరు తహశీల్దార్ పాలపర్తి రవికుమార్ వెల్లడించారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రభుత్వం నూతన నిర్ణయంతో బియ్యం, పంచదార తదితర సరుకుల కోసం లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్దకు రావాల్సి ఉందన్నారు. మండలంలో 48 రేషన్‌షాపులు ఉన్నాయని, వాటిలో 39 రెగ్యులర్ కాగా తొమ్మిది దుకాణాలు డ్వాక్రా సంఘాల ద్వారా (ఎస్‌హెచ్‌జి) నిర్వహిస్తున్నామని తెలిపారు. 25,563 కార్డుదారులకు పిడిఎస్ బియ్యం 3811.03 మెట్రిక్ టన్నులు, పంచదార 262.84 మెట్రిక్ టన్నుల ఎలాట్‌మెంట్ వచ్చిందని చెప్పారు. 65 ఏళ్ల దాటిన వారిని 3,321 మందిని గుర్తించామని, వారికి డీలర్లే ఖాళీ సమయంలో రేషన్ ఇంటికి తీసుకెళ్లి ఇచ్చేవిధంగా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రతి దుకాణం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు తెరిచి ఉండేలా టైమ్ ఛార్ట్‌ను ప్రభుత్వం రూపొందించిందని వివరించారు. చేబ్రోలులో దుకాణం-38లో ఆదివారం రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని జెసి ధాత్రిరెడ్డి, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు పాల్గొని ప్రారంభిస్తారని తహశీల్దారు వివరించారు.

చాట్రాయి :రేషన్ సరుకులు బియ్యం, పంచదార రేషన్ దుకాణాల వద్ద పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ బిహెచ్.ఈశ్వరరావు తెలిపారు. జూన్ నెల ఒకటో తేదీ నుంచి ఈ విధానం ప్రారంభం అవుతుందని తెలిపారు. 15 రోజుల పాటు రేషన్ డీలర్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 60 ఏళ్ల పైబడిన కార్డుదారులకు, వికలాంగులకు డీలర్లు ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేస్తారని, ఈ అవకాశాన్ని మండలంలోని రేషన్ కార్డుదారులందరూ వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

నూజివీడు టౌన్ :మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా రేషన్ దుకాణాల వద్ద ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ డీలర్లు పంపిణీ చేస్తారని తహశీల్దార్ జి.భద్రు తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు సంబంధిత రేషన్ డీలర్ వారి సరుకులను వారి ఇంటికి తీసుకెళ్లి అందిస్తారని తెలిపారు.

చింతలపూడి : జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ డిపోల వద్దే రేషన్ సరుకులను తీసుకోవాలని చింతలపూడి తహశీల్దార్ డిఎల్.ప్రమద్వర అన్నారు. 60 ఏళ్ల దాటిన వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దే డీలర్లు వచ్చి సరుకులను అందిస్తారని తెలిపారు.

జాతీయ రహదారిపై మరో ప్రమాదం

ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడి ఒకరు మృతి

19 మందికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జాతీయ రహదారిలో మరో ప్రమాదం చోటు చేసుకుంది. 40 మందితో ప్రయాణిస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ ఒక్కసారిగా డివైడర్‌ను దాటుకుని బోల్తా పడిన ఘటనలో 19 మంది గాయాలపాలయ్యారు. వారిలో ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. భీమడోలు జాతీయ రహదారిలోని దెందులూరు మండలం నాగహనుమాన్ ఫ్యాక్టరీ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. దెందులూరు ఎస్‌ఐ ఆర్.శివాజీ తెలిపిన వివరాల ప్రకారం... ఇంట్రసిటీ ప్రయివేట్ బస్సు రాజమండ్రి నుంచి హైదరాబాద్ బయలుదేరింది. శుక్రవారం అర్ధరాత్రి ముప్పవరం పంచాయతీ నాగహనుమాన్ ఫ్యాక్టరీ సమీపానికి వచ్చేసరికి బస్సు డివైడర్‌ను ఢీ కొట్టి రాజమండ్రి వైపు వెళ్లే రోడ్డులోకి వచ్చి వంతెనపై ఉన్న పూలకుండీలను ఢీ కొట్టి బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న దెందులూరు ఎస్‌ఐ ఆర్.శివాజీ, పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది, 108 సిబ్బంది, జెసిబితో 19 మంది క్షతగాత్రులను బయటకు తీశారు. వారందరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో వేదసాయికుమార్ అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అతను అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతి చెందాడు. రాజమండ్రికి చెందిన వేద సాయికుమార్ (27) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజులు సెలవుపై హైదరాబాద్ నుంచి రాజమండ్రి వచ్చి తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొవ్వాడ అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు గ్రీజింగ్ పనులు


పనులు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ గేట్లకు శనివారం ఇరిగేషన్ అధికారులు గ్రీజింగ్ పనులు నిర్వహించారు. కొవ్వాడ కాలువ ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుజాత ఆధ్వర్యంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్ 23 గేట్లకు గ్రీజింగ్ పనులు, ఎలక్ట్రికల్ పనులు నిర్వహించారు. మరో వారం రోజుల పాటు పనులు నిర్వహిస్తున్నట్లు సిబ్బంది ఇల్లింగి సత్యనారాయణ తెలిపారు. రానున్న వర్షాల సీజన్‌లో గేట్లు సులభతరంగా ఎత్తిదించడానికి వీలయ్యేలా పనులు నిర్వహిస్తున్నామని, కాలువలో మూడు వందల మీటర్ల మేర ఇప్పటికే పూడికతీత పనులు పూర్తి చేశామని తెలిపారు. గత వరదలకు కాలువ గట్టు దెబ్బతిన్న ఆరు ప్రాంతాల్లో గట్లు పటిష్టపరిచే పనులు జరుగుతున్నాయని, వాటిలో మూడు ప్రాంతాల్లో 75 శాతం పనులు, మరో మూడు ప్రాంతాల్లో 50 శాతం పనులు పూర్తయ్యాయని, రానున్న వర్షాల సీజన్ నాటికి పనులు పూర్తయ్యేలా వేగవంతంగా జరుగుతున్నాయని డిఇఇ సుజాత తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయం : ఎంఎల్‌ఎ బడేటి


ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందనడానికి ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్లు ఒక నిదర్శనమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తమ కూటమి ప్రభుత్వం ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా పెన్షన్ నగదు అందిస్తుందని చెప్పారు. ఎన్‌టిఆర్ భరోసా ఫెన్షన్ల పంపిణీ జిల్లా కేంద్రమైన ఏలూరులో శనివారం ఉదయాన్నే ప్రారంభించారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్లు అందించారు. ఏలూరు 34వ డివిజన్ పాండురంగపురం ప్రభుత్వ పాఠశాల వద్ద ఎంఎల్‌ఎ బడేటి చంటి స్వయంగా లబ్ధిదారులకు పెన్షన్ల నగదు మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడంతో పాటు క్షేత్రస్థాయిలో వారితో మమేకమై సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నగరంలో పారిశుధ్యం విషయానికి సంబంధించి ప్రజా సహకారం ఎంతో అవసరమని, ఈ విషయంలో ప్రజలు మనస్ఫూర్తిగా పాలకులు, అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఆకాంక్షించారు. ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజల మద్దతు పూర్తిస్థాయిలో ఉన్నప్పుడే ప్రభుత్వానికి మనోధైర్యం కలుగుతుందని, దీంతో ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏలూరు ఎంఎల్‌ఎ ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, పలువురు కార్పొరేటర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరులో...

ఉంగుటూరు :ఉంగుటూరు ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ శనివారం పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందించారు. జూన్ నెలకు సంబంధించి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు ఒక రోజు ముందుగానే పంపిణీ చేసిన క్రమంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణలో భాగంగా ఆయన కైకరం, ఉంగుటూరు, ఉప్పాకపాడు, బాదంపూడి గ్రామాల్లో పర్యటించి పంపిణీ చేశారు. మండలంలో 25 గ్రామ సచివాలయ పరిధిలో 11,243 పింఛన్లు ఉన్నాయి. శనివారం సాయంత్రానికి దాదాపు 99 శాతం పంపిణీ పూర్తిచేశారు. గ్రామంలో లేని వారికి ఆదివారం అందిస్తే నూరుశాతం పూర్తవుతుందని ఎంపిడిఒ వెల్లడించారు.

జీలుగుమిల్లిలో...

జీలుగుమిల్లి : మండలవ్యాప్తంగా 4,219 పెన్షన్లకు 3,838 పింఛన్లను సచివాలయ సిబ్బందితో శనివారం పంపిణీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక్క రోజు ముందే పెన్షన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. పెన్షన్ల పంపిణీలో పలుచోట్ల కొంతసేపు సర్వర్ సమస్య ఇబ్బంది పెట్టినా సిబ్బంది పంపిణీ ఆపలేదని తెలిపారు. మండలవ్యాపంగా 91 శాతం వరకు పెన్షన్ల ప్రక్రియ పూర్తయినట్లు ఆయన తెలిపారు.

కూటమి హయాంలో భూ కబ్జాలు

పోలవరం మాజీ ఎంఎల్‌ఎ బాలరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ భూములే కాకుండా ప్రజల భూములు కూడా కబ్జాలకు గురవుతున్నాయని, అందుకు ఉదాహరణగా కొయ్యలగూడెంలోని సర్వే నెంబర్ 311/2 నిలుస్తుందని పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. బాలరాజు శనివారం కొయ్యలగూడేనికి విచ్చేసిన సమయంలో టిటిడి కల్యాణ మండప ప్రాంతవాసులు తమ భూముల కబ్జా విషయం గురించి మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రూ.కోట్ల విలువైన భూమి గురించి ఇప్పటికే సమగ్రంగా విషయాలను సేకరించానని, చిన్నపాటి లొసుగులను భూతద్దంలో చూపించి రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేయడానికి పెద్ద పన్నాగం నడుస్తోందన్నారు. ఈ విషయంలో ప్రజలను కంగారు పడవద్దని ప్రజా ప్రతినిధులు ప్రజల పక్షాన ఉన్నట్లు మభ్యపెడుతూ మరోవైపు కబ్జాదారులకు కూటమి ప్రజాప్రతినిధులు వెన్ను కాస్తున్నారని ఆరోపించారు. 40 ఏళ్లకు పైగా నివాసం ఉంటున్న స్థానికుల జోలికి వస్తే పర్యవసానం తీవ్రంగా ఉంటుందని ఆయన హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు పార్లమెంట్, అసెంబ్లీ, నియోజకవర్గాల పెద్దల ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. ఆయనతో పాటు ఎంపిపి గంజిమాల రామారావు, పార్టీ రాష్ట్ర బిసి సెల్ సహాయ కార్యదర్శి గంటా శ్రీను, పట్టణ కన్వీనర్ సంకుకొండ, ఘంటసాల సాయి, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, తొంటా వాసు, తదితరులు ఉన్నారు.

రాజ్‌కుమార్‌కు గణేష్‌కుమార్ అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని 15వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నూతనంగా నియమితులైన సీనియర్ న్యాయవాది వాకా రాజ్‌కుమార్‌ను రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పోలుపర్తి వెంకట గణేష్‌కుమార్ అభినందించారు. నూజివీడుకు శనివారం విచ్చేసిన సందర్భంగా రాజ్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్ మాట్లాడుతూ కొప్పుల వెలమ సామాజిక తరగతి అభ్యున్నతికి అహర్నిశలు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర గృహ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో సంప్రదించి త్వరలోనే కొప్పుల వెలమ సామాజిక తరగతికి సంబంధించి నియోజకవర్గ సమావేశం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. గణేష్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చింతల అప్పారావు, కౌన్సిలర్ నౌడు నాగమల్లేశ్వరరావు, దాసరి అప్పాజీ, వాకా నాగరాజు, టిడిపి టౌన్ సెక్రటరీ పల్లి నాగరాజు, మరడ దుర్గారావు, ఎదురేసి ఎరకయ్య, సలుమూరి మూర్తి, జివి.రామారావు, పాసిల సత్యనారాయణ, పొర్లు సతీష్, న్యాయవాది యమలపల్లి హరిబాబు, నవుడు రవి, దుబ్బిరెడ్డి శ్రీనివాసరావు, సిరెడ్డి సత్య నారాయణ, శ్రీరాములు రవీంద్ర, గొల్లు లక్ష్మణ్, ఆదుపు రెడ్డి నాగేశ్వరరావు, వాకా రామ్మో హన్ రావు, గుడిపూడి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని శ్రీ మాడపాటి వెంకటేశ్వరరావు పంతులు విక్టోరియా టౌన్ హాల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం శనివారం రాత్రి ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమం ద్వారా ఈనెల 1వ తేదీ నుంచి నెల రోజులపాటు చిన్నారులకు, విద్యార్థులకు బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో ఉచిత శిక్షణ అందించారు. నెల రోజుల్లో ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి ఎం.సేవ్య మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనపరిస్తే భవితకు బంగారు బాటలు వేసినట్లేనన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ నౌడు నాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ క్లబ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాకా రాజ్ కుమార్, మరో కౌన్సిలర్ దాసరి అప్పాజీ మాట్లాడుతూ తాము విద్యార్థి దశలో క్రీడల్లో సాధించిన విజయాలు, పొందిన ప్రయోజనాలను వివరించారు. సీనియర్ పీడీ, ప్రధాన కోచ్ డాక్టర్ వాకా నాగరాజు మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందన్నారు. సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ప్రావీణ్యత సాధించడం ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు వేగంగా పొందవచ్చన్నారు.

విప్లవాత్మక మార్పులతో నాణ్యమైన పొగాకు

సిటిఆర్‌ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్

జీలుగుమిల్లి :పొగాకు సాగులో విప్లవాత్మక మార్పులతో అధిక దిగుబడితో నాణ్యమైన పొగాకును పండించవచ్చని సిటిఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్ తెలిపారు. సిటిఆర్‌ఐ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్షేత్ర దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొగాకు క్యూరింగ్ దశ పూర్తయిన అనంతరం పొగాకులో గ్రేడింగ్ నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ యాజమాన్య పద్ధతిలో పొగాకు సాగు చేయడం ద్వారా ఉత్తమ నాణ్యత, అధిక దిగుబడి సాధించవచ్చని రైతులకు వివరించారు. గత 30 ఏళ్లుగా రైతులు క్యూరింగ్ సమయంలో కలప వాడకం వల్ల పొగాకు గ్రేడ్‌లో నాణ్యత తగ్గుతుందని గుర్తించామని, కలపకు బదులు గ్యాస్‌ను వినియోగించుకోవడం ద్వారా కాలుష్య నివారణతో పాటు నాణ్యమైన పొగాకు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిసిఎల్ జనరల్ మేనేజర్ వర్నేకర్, సంస్థ చీఫ్ మేనేజర్ లలిత, పొగాకు బోర్డు ఎక్స్టెన్షన్ మేనేజర్ సురేఖ, ఆర్‌ఎం ప్రసాద్, ప్రాజెక్ట్ హెడ్ ఎల్‌కె.ప్రసాద్, సిటిఆర్‌ఐ హెడ్ సుబ్బయ్య, అసిస్టెంట్ ఫామ్ మేనేజర్లు టి. రమేష్, వెంకటేష్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.